క్లుప్తంగా

కేంద్ర మంత్రులను కలిసిన బీజేపీ నాయకులు



జనగామ: ఢిల్లీలో గురువారం జరిగిన కేంద్ర బొగ్గు, మైనింగ్ శాఖామాత్యులుగా గంగాపురం కిషన్‌రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి బీజేపీ జిల్లా నాయకులు బేజాటి బీరప్ప, బల్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌ను వారు శాలువాతో సత్కరించారు.

వరంగల్ ఎంపీ కావ్యకు అభినందనలు



రఘునాథపల్లి: వరంగల్ ఎంపీగా విజయం సాధించిన కడియం కావ్యను గురువారం పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో నిడిగొండ, కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్లు, గంగిడి నర్సింహారెడ్డి, చీమలపాటి రవీందర్‌జీ పార్టీ నాయకులతో ఎంపీ, ఎమ్మెల్యేలతో బేటి అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పలు అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ నాయకులు అయిత జయరాములు, రాపోలు రామ్మూర్తి, గాదె మహేందర్‌రెడ్డి, బాలపురి రాజేందర్, నీలం యువరాజ్, రాపోలు పృథ్వి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన నాగపురి



జనగామ: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ హైదరాబాద్‌లో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మల్లన్న ప్రమాణ స్వీకార కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి పాల్గొన్న అనంతరం, ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మల్లన్నను కలిసిన వీరస్వామి

లింగాలఘణపురం: మండలంలోని కుందారం గ్రామానికి చెందిన తీన్మార్ మల్లన్న టీం జిల్లా నాయకుడు చిర్ర వీరస్వామి గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన తీన్మార్ మల్లన్నను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి పట్టభద్రుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



పాలకుర్తి టౌన్: తమ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ నాయకులు గురువారం సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కాగా, సీఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు వేణు, కార్యదర్శి సోమేశ్వర్ ఉన్నారు.

వర్షాలు కురవాలని మైసమ్మతల్లికి బోనాలు



రఘునాథపల్లి: మండలంలోని భానాజీపేటలో వర్షాలు సమృద్ధిగా కురవాలని గురువారం గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో బోడబండ మైసమ్మ తల్లికి బోనాలు చేశారు. పత్తి విత్తనాలు నాటాక వర్షాలు కురువక పోవడంతో ఆందోళనలో ఉన్న గ్రామస్తులు డప్పుచప్పుళ్లతో బోనాలతో మైసమ్మగుడి వద్దకు చేరుకొని బోనాలు సమర్పించి వర్షాలు కురుపించు తల్లి అంటూ నైవేద్యం సమర్పించారు. మొసమ్మ తల్లికి ఒడి బియ్యం పోసి నిస్సారంగా వర్షాలు కురిపించాలని మహిళలు వేడుకున్నారు. మాజీ సర్పంచ్ గొరిగ భాగ్య, మాజీ ఎంపీటీసీ పగిడిపల్లి కృష్ణ, యేనిగ కుమార్, చిక్కుడు కొముర‌య్య, కురాకుల శ్రీను, ఉప్పలయ్య, చాట్ల శ్రీను, వెంకన్న, పాల్గొన్నారు.

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామ శివారులోని ఏనెగుట్ట నుంచి ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. టిప్పర్ లారీలకు అడ్డంగా నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రి, పగలు తేడా లేకుండా టిప్పర్‌లారీలతో ఓవర్‌లోడ్‌తో మట్టిని తరలిస్తున్నారన్నారు. దీంతో గ్రామంలోని బీటీ రోడ్లు ధ్వంసం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రోడ్డు కింద ఉన్న మిషన్ భగీరథ పైపులైన్లు ధ్వంసం అవుతున్నాయన్నారు. పైపులు పగిలి కలుషిత నీరు అవుతుందని తెలిపారు. ఇష్టారాజ్యంగా తిరుగుతున్న టిప్పర్‌లారీలతో గ్రామంలో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని గతంలో పలుమార్లు చెప్పినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, టిప్పర్ లారీలను నడపకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో పల్లె రవీందర్, మైబుపాషా, పోకల లక్ష్మీనర్సయ్య, ఎస్.క్రిష్ణమూర్తి, ఎల్లమ్మ, మహేందర్, మంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.



టిప్పర్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



బడిబాట ర్యాలీలో మాట్లాడుతున్న రవి

స్టేషన్‌ఘన్‌పూర్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందిస్తున్నారని జెడ్పీటీసీ, జెడ్పీస్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి అన్నారు. మండలంలోని తాటికొండలో జెడ్పీఎస్ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులచే గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. తెలంగాణరాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేశారని, ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుంటూ పిల్లలను బడికి పంపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం కొడ రాజేందర్, సునీల్‌కుమార్, రాము, మురళి, రాజు, నాయకులు మారపాక రాములు, బాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

కొడకండ్ల: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, గ్రామీణ నిరుపేద విద్యార్థులకు డిజిటల్ విద్యా బోధన అందించాలనే సంకల్పంతోనే గ్రీన్‌కో ఫౌండేషన్ ద్వారా డిజిటల్ ప్రొజెక్టర్‌ను అందించినట్లు జిలేష్ పవర్ ప్లాంట్ మేనేజర్లు వాకా ప్రసాద్, మధుప్రియ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు రూ.55,016 విలువ చేసే డిజిటల్ ప్రొజెక్టర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.37 వేల విలువ చేసే రిఫ్రిజిరేటర్, పోలీస్‌స్టేషన్‌కు సీసీ కెమెరాల పర్యవేక్షణ కోసం రూ.45 వేల విలువ చేసే టీవీని, రంగాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.5,800 మైక్‌సెట్‌ను మండలకేంద్ర పరిధిలోని గ్రీన్‌కో ఫౌండేషన్ ద్వారా మేనేజర్లు అందజేశారు. డాక్టర్ హరికృష్ణ, ఎస్సై శ్రావణ్‌కుమార్, హెచ్ఎం ప్రభాకర్, సంస్థ సిబ్బంది బోయిని నరేష్, మురళీ, దామోదర్, శ్రీనివాస్, భానుచందర్, జానకిరామ్, కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



డిజిటల్ ప్రొజెక్టర్‌ను అందజేస్తున్న మేనేజర్లు ప్రసాద్, మధుప్రియ

దరఖాస్తుల ఆహ్వానం

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో హిందీ, సైన్స్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని (అవర్స్ బేస్డ్) తాత్కాలిక ప్రాతిపదికన బోధించేందుకు ఆసక్తి గల అర్హులైన వారు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పుష్పకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ బోధించేందుకు పీజీతో పాటు హెచ్‌పీటీ, సైన్స్ బోధించేందుకు డిగ్రీతో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలని వివరించారు.

గుండెపోటుతో కలెక్టరేట్ హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్ మృతి



జనగామ: జనగామ కలెక్టరేట్‌లో గత కొంత కాలంగా హౌస్ కీపింగ్ సూపర్ వైజర్‌గా పని చేస్తున్న ఐలబోయిన మహేష్(30) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. యాదాద్రి-భువనగిరి జిల్లా ఆలేరు మండలం ఫతేపూర్‌కు చెందిన మహేశ్ రెండు సంవత్సరాలుగా జనగామలో అద్దె ఇంట్లో నివాసముంటూ, కలెక్టరేట్‌లో హౌస్ కీపింగ్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో గుండెపోటుకు గురై బెడ్‌పైనే కుప్పకూలి పోయాడు. గమనించిన తల్లి.. మహేష్‌ను స్థానికుల సాయంతో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి



చిల్పూరు: హెచ్‌ఎంను సన్మానిస్తున్న టీచర్లు



స్టేషన్‌ఘన్‌పూర్: హెచ్ఎం రమేశ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిల్పూరు: పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేద్దామని హెచ్ఎం రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలోని నష్కల్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించిన రామ్మోహన్‌రావు పదోన్నతిపై గెజిటెడ్ హెడ్‌మాస్టర్ హోదాలో శ్రీపతిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వచ్చారు. ఈ మేరకు రామ్మోహన్‌రావు హెచ్ఎంగా గురువారం పాఠశాలలో బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఇన్‌చార్జ్ హెచ్ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఉపాధ్యాయులు శ్రీనికాంత్, జయంతి, ప్రసాద్, రాజు, అరుణ ఉన్నారు.

గెజిటెడ్ హెచ్ఎంల బాధ్యతల స్వీకరణ

రఘునాథపల్లి: గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతి పొందిన తొమ్మిది మంది ప్రధానోపాధ్యాయులు గురువారం పలు పాఠశాలల్లో విధుల్లో చేరారు. వారిలో ఖిలాషాపూర్ హెచ్ఎంగా భారత రవీందర్, భాంజీపేట హెచ్ఎంగా రాజాహన్మంతరెడ్డి, కంచనపల్లి హెచ్ఎంగా సత్యనారాయణ, మండలగూడెం హెచ్ఎంగా వృకోధర్, అశ్వరావుపల్లి హెచ్ఎంగా శోభన్‌బాబు, గబ్బెట హెచ్ఎంగా ఇబ్రాహీం, ఇబ్రహీంపూర్ హెచ్ఎంగా శాంతికుమారి, మేకలగట్టు హెచ్ఎంగా సంపత్‌కుమార్, కోమళ్ల హెచ్ఎంగా కె నర్సింహులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరిన గెజిటెడ్ హెచ్ఎంలను ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు.



రఘునాథపల్లి: భారత రవీందర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

శివునిపల్లి జెడ్పీఎస్ఎస్ హెచ్ఎంగా రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన కుసుమ రమేశ్ శివునిపల్లి జెడ్పీఎస్ఎస్ హెచ్ఎంగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని నమిలిగొండ యూపీఎస్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్) రమేశ్ పదోన్నతిపై గెజిటెడ్ హెడ్‌మాస్టర్‌గా శివునిపల్లికి వచ్చారు. కాగా, పదోన్నతిపై గెజిటెడ్ హెచ్ఎంగా వచ్చిన రమేశ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం, శాలువాతో అభినందించారు.

కడియం శ్రీహరితోనే ఆలయ అభివృద్ధి

చిల్పూరు: ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిల కృషితోనే చిల్పూరు బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి చెందుతుందని ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. గురువారం శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతులు ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయానికి భక్తుల సంఖ్య పెరిగినందున మరింత అభివృద్ధి చేసేందుకు బుధవారం ఆలయాన్ని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే ఎస్టిమేషన్ వేయాలని ఆదేశించడం హర్షనీయమన్నారు. ఆయన వెంట నాయకులు చిర్ర నాగరాజు, బొట్టు చేరాలు, రత్నాకర్‌రెడ్డి, జీడి ఆనందం, అశోక్‌పాల్ తదితరులు ఉన్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న శ్రీధర్‌రావు

వనరుల దోపిడీపై తిరుగుబాటు తప్పదు

దేవరుప్పుల: వాగు పరివాహక ప్రాంతాల్లో సాగు, తాగునీటి కల్పనకు దోహదపడే ఇసుక వనరుల దోపిడీని పాలకవర్గాలు, ప్రభుత్వాలు నిలువరించకుంటే ఉద్యమచైతన్యవంతులైన ఇక్కడి మండల ప్రజల తిరుగుబాటు అనివార్యమని ఉస్మానియా జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు ఇప్ప పృథ్వీరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి మాటున ఇసుక దోపిడీకి పాల్పడడంతో కోలుకొండ నుంచి గొల్లపల్లి వరకూ వాగులో పలు ప్రాంతాల్లో మట్టితేలిన ఆనవాలు భవిష్యత్ కరువుకు అద్దం పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కాస్తాకూస్తో చెక్‌డ్యామ్‌ల వద్ద ఉన్న ఇసుకను స్థానిక అవసరాల పేరిట రిజర్వాయర్ల కాంట్రాక్టర్లకు అనుమతులు ఇచ్చి తరలించే ప్రక్రియ తగదన్నారు. వాగు పరివాహక ప్రాంతాల రైతుల జీవనాధారానికి కీలక వనరులైన ఇసుకను కాపాడే దిశలో రైతుల పక్షాన నిలుస్తున్న పార్టీలతోపాటు అన్ని వర్గాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టిసారించి ఇసుక రవాణా కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నవీన్ మిట్టల్‌ను తొలగించాలి



జనగామ రూరల్: నవీన్ మిట్టల్‌ను సీసీఎల్ఏ పదవి నుంచి తొలగించాలని సాధిక్ అలీ ఫౌండేషన్ చైర్మన్ సాధిక్ అలీ కోరారు. ఈ మేరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. సీసీఎల్ఏ పదవి నుంచి నవీన్ మిట్టల్‌ను తొలగించాలని ముఖ్యమంత్రికి రైతులతో పోస్టు కార్డులు పంపించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ ధరణిని మార్పు చేయాలని కోరుతున్నా తీవ్ర జాప్యం చేస్తూ అడ్డుపడుతున్నారని అన్నారు. నవీన్ మిట్టల్‌ను మార్చేవరకు ప్రజాఉద్యమం చేపడతామన్నారు. రైతులు, ధరణీ భాదితులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గీత కార్మికుడికి గాయాలు

దేవరుప్పుల: పిడుగుపాటుకు గీతకార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రంబోజీగూడెంలో చోటుచేసుకుంది. మండలంలోని చిన్నమడూరు రెవెన్యూ పరిధి రంబోజీగూడేనికి చెందిన గీత కార్మికుడు గైని సోమయ్య రోజూరీగా గురువారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా ఉరుములు, మెరుపులతో వర్షం పడే సూచనలు చూసి కిందికి దిగుతుండగానే చెట్టుపై పిడుగు పడింది. ఈ పిడుగుపాటుకు సోమయ్య కాలు పాదం విరగడమేగాక మోకాలు, మోచేతులు, వెన్నుపూసకు తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థల పరిసరాల గీత కార్మికులు గమనించి చికిత్స కోసం వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న టీజీ గీతకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు పరీదుల భాస్కర్, టీసీఎస్ అధ్యక్షుడు రామచంద్రయ్య, వంగ దశరథ, రాంపెల్లి యాదగిరి, ఉప్పునూతుల భాస్కర్,నర్సయ్య,సోమయ్య, శ్రీనివాస్ పరామర్శించి మెరుగైన వైద్యచికిత్సల కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న గీత కార్మిక సంఘ నాయకులు

వేలం వాయిదా

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని వారంతపు సంతలో హక్కుల కోసం వేలం నిర్వహించగా సరైన వేలం పాట రానందున వాయిదా వేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వేలం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. పశువుల రహదారి, తైబజార్, డక్కాలకు గత టెండర్ దారుల కాలపరిమితి ముగియడంతో మళ్లీ వేలం పాటలను నిర్వహించామన్నారు. సరైన పాట రానందున వాయిదా వేస్తూ శనివారం మళ్లీ వేలం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, చక్రధర్, సిబ్బంది మల్లేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న డీఏఓ వినోద్‌కుమార్

గుట్కాలు విక్రయిస్తే చర్యలు తప్పవు



షాపును తనిఖీ చేస్తున్న ఏసీపీ, సీఐ, ఎస్సై

పాలకుర్తి టౌన్: అనారోగ్యానికి కారణం అవుతున్న నిషేధిత గుట్కాలను షాపుల్లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య అన్నారు. పాలకుర్తిలోని కిరాణం, పాన్ షాపుల్లో గురువారం ఆయన సీఐ, ఎస్సై సాయిప్రసన్న కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజల అనారోగ్యానికి దోహదం చేస్తున్న గుట్కా ప్యాకెట్లను విక్రయించకూడదని అన్నారు.

గొడ్డలితో మహిళపై దాడి



నర్మెట: మంత్రాలు చేస్తుందనే నెపంతో యువకుడు గొడ్డలితో మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండలకేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలకేంద్రానికి చెందిన నక్కల పోషయ్య కుటుంబం గత కొద్దికాలంగా అనారోగ్యంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాగా, ఇందుకు తమ పాలివారైన నక్కల గట్టయ్య భార్య సత్తెమ్మ కారణమంటూ కక్షపెంచుకున్న పోషయ్య కొడుకు నక్కల రవి (బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు) వీధినాటకం చూసి వస్తున్న ఆమెను బుధవారం రాత్రి గొడ్డలితో తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులకు సమాచారం అందించిన కటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. బాధితురాలి కుమారుడు అంజయ్య ఇచ్చిన ఫిర్యాదుమేర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

కొడకండ్ల: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు సోమశేఖర్ తండ్రి ముత్తయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాలను గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ పరామర్శించారు. అలాగే కున్సోత్‌తండాకు చెందిన బన్నా కుటుంబసభ్యులను కూడా ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నాయకులు సోమనర్సయ్య, సంజీవ, రమేష్, యాకేష్, రాజు, వీర్యానాయక్, క్రాంతిగౌడ్, వెంకట్రాం, యాకూబ్ తదితరులు ఉన్నారు.

ఎన్నిక



రాజు

జఫర్‌గఢ్: తెలంగాణ ఫిషర్ మెన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా మండలంలోని కునూర్ గ్రామానికి చెందిన చనబోయిన రాజు ఎన్నికయ్యారు. ఈమేరకు గురువారం రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సన్మానం

చిల్పూరు: చిల్పూరు గుట్ట ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేలా కృషిచేస్తున్న ఆలయ మాజీ చైర్మన్, ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్ రావును కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. మండలంలోని పల్లగుట్ట గ్రామంలోని ఆయన నివాసంలో అభినందన సభను కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దార రాజు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర నాగరాజు, పేరాల సుధాకర్, రత్నాకర్‌రెడ్డి, జీడి రమేష్, ఇసురం శ్రీను, వెంకన్న, జీడి ఆనందం, దార అనీల్, అశోక్‌పాల్, గుర్రపు ఏసు, కష్ణ, జగదీష్, అనూఫ్, బేభ, చందు పాల్గొన్నారు.

విద్యార్థినికి..

జనగామ రూరల్: పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన చిన్న పెండ్యాల ఉన్నత పాఠశాలకు చెందిన గద్దం నవ్యను అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం శాలువతో సన్మానించారు. అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మణి తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



బచ్చన్నపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలంలోని కొడవటూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బ్యాంగి రూపాచైతన్య అన్నారు. గురువారం గ్రామంలోని జీపీ కార్యాలయంలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రూపాచైతన్య మాట్లాడారు. ఇంటి చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ ప్రేమలక్ష్మి, ఆశా వర్కర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం

దేవరుప్పుల: ప్రమాదవశాత్తు ఆస్పత్రిలో చేరిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యచికిత్సలు చేయిస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు అన్నారు. గురువారం రాత్రి అప్పిరెడ్డిపల్లెకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ పులిగిల్ల మల్లయ్య కుక్కకాటుకు, రంబోజీగూడెంలో పిడుగుపాటుకు తీవ్రగాయాలపాలైన గైని సోమయ్యను ఆయన పరామర్శించారు. నాయకులు పరీదుల భాస్కర్, గనుపాక నాగరాజు, రెడ్డిరాజుల యాకన్న, దశరథ, భాస్కర్ ఉన్నారు.

'మిషన్' సర్వేను వేగవంతం చేయాలి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల వివరాల తెలుసుకునేందుకు ఇంటింటా సర్వేలను పంచాయతీ కార్యదర్శులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల వార్డుల్లో ఆయన పర్యటించి పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది లబ్ధిదారుల వద్ద తీసుకుంటున్న సర్వే వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందరికి భగీరథ నల్లా కనెక్షలు ఉన్నాయా, ఉంటే నీరు ఎలా వస్తుందని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: మండలంలోని సూరారం గ్రామ పంచాయతీ పరిధిలోని చర్లతండా, నక్కలపల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటా సర్వే నిర్వహించడం జరిగిందని గ్రామ పంచాయతీ కార్యదర్శి శైలజ తెలిపారు. గురువారం గ్రామాల్లో సర్వే చేపట్టి ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతీ ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ కనెక్షన్ ఉందా, తాగునీటి సరఫరా అవుతుందా లేదా బోరుబావుల నీటిని వాడుతున్నారా తదితర విషయాలను అడిగి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కారోబార్ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, సీఏ రజిత సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం అందజేత



బచ్చన్నపేట: మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామంలో బుర్రి లచ్చమ్మ ఇటీవల మృతి చెందింది. కాగా గ్రామ మాజీ సర్పంచ్ పిన్నింటి బాపురెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పిన్నింటి కావ్యశ్రీరెడ్డిలు బాధిత కుటుంబీకులను పరామర్శించి 50 కిలోల బియ్యం గురువారం అందజేశారు. నాయకులు బుర్రి రాములు, పిన్నింటి నారాయణరెడ్డి, నిమ్మ కర్ణాకర్‌రెడ్డి, మల్గ సిద్దులు, కనకసేనారెడ్డి, మంద కమలాకర్, నక్క సిద్దులు, గుండి శ్రీను, నర్సింహులు, బాలు, ఉర్మిళ, రమేష్, మధు, దిలీప్ ఉన్నారు.

పాఠ్యపుస్తకాల్లో ముందు(పాత)మాట దుమారం

- పాఠశాలల నుంచి తిరిగి పంపిన పుస్తకాలు

దేవరుప్పుల: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు అందించే పాఠ్య పుస్తకాల ముందుమాటలో పాత ప్రభుత్వ అంశాన్ని పొందుపర్చడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జిల్లాలోని పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా ఉపాధ్యాయులు 1వ తరగతి నుంచి 10వ తరగతి తెలుగు వాచకం పాఠ్య పుస్తకాలలో మాజీ సీఎం కేసీఆర్, నాటి మంత్రులు జగదీష్‌రెడ్డి, కడియం శ్రీహరి పేర్లతో కూడిన పుస్తకాలను పంపిణీ చేసింది విదితమే. ఈ క్రమంలోనే పుస్తకాల్లో ప్రచురణకు సంబంధించి కొత్త వివాదం తలెత్తింది. తెలుగు పాఠ్యంశ పుస్తకాల్లోని మొదటి పేజీలో ఉండే ముందుమాటలో కొత్త ప్రభుత్వ పాలకవర్గం ప్రాతినిధ్య అంశాన్ని మార్చకుండానే విద్యాశాఖ పుస్తకాలను ముద్రించి పంపిణీ చేయగా వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో ఆదరబాదరగా గుర్తించిన కొందరు ఉపాధ్యాయులు ముందుమాట పేజీ చింపేసి ఇవ్వగా దాని వెనుకాల వందేమాతరం, ప్రతిజ్ఞ కనుమరుగైంది. దీంతో తప్పుకు మరో రెండు తప్పులు జరిగే తీరును తీవ్రంగా పరిగణించిన విద్యాశాఖ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి గురువారం సాయంత్రం యుద్ధప్రాతిపదికన పంపిణీ చేసిన వాటితో పాటు స్టాకు పుస్తకాలను తిరిగి తెప్పించుకుని కొత్త ముద్రణకు పంపడం కొసమెరుపు. వారం నుంచి విస్తృత బడిబాట కార్యక్రమం చేపట్టి బడులను పునఃప్రారంభించిన బడిపంతుళ్లకు పుస్తకాల మోత తప్పలేదు.